న్యాల్‌కల్‌లో స్వల్పంగా కంపించిన భూమి

ఆందోళనతో ఇళ్ల నుంచి పరుగులు పెట్టిన ప్రజలు

న్యాల్‌కల్, జనవరి 27: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని న్యాల్‌కల్, ముంగి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించిది. దీంతో ఆయా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. సెకను పాటు భూమి కంపించిందని, ఎలాంటి నష్టం జరుగలేదని, ఇందుకు సంబంధించిన వివరాలను భూగర్భజల, విపత్తులశాఖకు సమాచారం ఇస్తామని డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి వివరించారు.



పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన!

- కసరత్తు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- ఎంబీ రికార్డులు ఉంటేనే బిల్లుల చెల్లింపులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 27: సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన అమలులోకి రానున్నది. పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో జరిగిన విషయం తెలిసిందే. వీరి పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్నప్పటికీ తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని తెలుస్తున్నది. ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకాలకు జిల్లా యంత్రాంగం కసరత్తు పూర్తిచేసింది. పంచాయతీలవారీగా స్పెషల్ ఆఫీసర్ల జాబితాను సిద్ధం చేసింది. ప్రభుత్వం అడిగిందే తడవుగా జాబితాను పంపించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.

ఆయా శాఖల ఉద్యోగులకు బాధ్యతలు

జిల్లాలో 647 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లుగా జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను నియమిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలలో పనిచేస్తున్న వీరికి అవసరాలను బట్టి ఒక్కొక్కరికి ఒకటి లేదా రెండు గ్రామ పంచాయతీలను కేటాయించనున్నారు. వీరిపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

ఎంబీ రికార్డులుంటేనే చెల్లింపులు

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు తమ పదవీ కాలంలో చేపట్టిన బిల్లుల చెల్లింపులకు కచ్చితంగా ఎంబీ రికార్డులు ఉండాల్సిందేనని పంచాయతీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ, ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. వీటి ద్వారా గ్రామ పంచాయతీల్లో వివిధ పనులను చేపట్టడం జరిగింది. ఆయా పనుల్ల చాలావాటికి బిల్లులు చెల్లింపులు జరగలేదు. పదవీ కాలం ముగుస్తున్నా చేసిన బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ వద్ద ప్రస్తావించగా పంచాయతీలలో పూర్తిచేసిన పనులకు సంబంధించి ఈనెలాఖరులోగా ఎంబీరికార్డులు, గ్రామ పంచాయతీ తీర్మానాలు, స్టాక్ రిజిస్టర్ ఉంటే బిల్లులు చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

ఎరువుల లెక్క.. ఇక పక్కా

అందుబాటులోకి 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం'

ఎరువుల దుకాణాల్లో నిల్వల వివరాల నమోదుకు యాప్

మెదక్, జనవరి 27: ఎరువుల నిల్వల లెక్కలు ఇకపై పక్కాగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వం వద్ద ఎరువుల నిల్వల లెక్క పక్కాగా లేకపోవడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. రికార్డుల్లో ఉన్న వివరాలకు.. గోడౌన్లలో ఉన్న నిల్వలకూ వ్యత్యాసం ఉంటున్నట్టు వ్యవసాయ అధికారుల తనిఖీల్లో తరచుగా బయటపడుతున్నది. దీంతో వ్యవసాయశాఖ నూతన సాంకేతికత ఆధారంగా పక్కా వ్యవస్థను రూపొందించింది. ఎరువుల నిల్వల్లో తేడాలు ఉండకుండా వివరాలను నమోదు చేయడానికి 'ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్'ను అమల్లోకి తెచ్చింది. ఎరువుల లెక్కలు తేల్చడానికి ఈ యాప్ అధికారులకు ప్రయోజనకారిగా మారింది.



రామాయంపేటలోని ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి(ఫైల్)

రసాయన ఎరువులే ఎక్కువ

రైతులు పంటసాగుకు రసాయన ఎరువులనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో వరి సాగుకు డీఏపీ, యూరియాను విరివిగా వినియోగిస్తారు. జిల్లాలో 24,012 మెట్రిక్ టన్నుల యూరియా, 3,205 మెట్రిక్ టన్నుల డీఏపీ యాసంగి పంటల సాగుకు వినియోగిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ తమ యాక్షన్ ప్లాన్‌లో పేర్కొంది. గత సీజన్లకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే.. సగటున రైతులు అక్టోబరులో 600 మెట్రిక్ టన్నులు, నవంబరులో 512 మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 3,740 మెట్రిక్ టన్నులు, జనవరిలో 5,560 మెట్రిక్ టన్నులు, ఫిబ్రవరిలో 9,500 మెట్రిక్ టన్నులు, మార్చిలో 4,100 మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగిస్తున్నారు. అదే విధంగా డీఏపీ వినియోగాన్ని పరిశీలిస్తే అక్టోబరులో 130 మెట్రిక్ టన్నులు, నవంబరులో 180 మెట్రిక్ టన్నులు, డిసెంబరులో 1,400 మెట్రిక్ టన్నులు, జనవరిలో 1,021 మెట్రిక్ టన్నులు, ఫిబ్రవరిలో 224 మెట్రిక్ టన్నులు, మార్చిలో 250 మెట్రిక్ టన్నులు వాడుతున్నారు. ఏ నెలలో ఎంత ఎరువులు అందుబాటులో ఉంచాలనే లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. దీని ఆధారంగానే అధికారులు ఎరువులు సరఫరా చేస్తారు.

దుకాణాల్లో తనిఖీలు

జిల్లాలో మండల వ్యవసాయాధికారులు 15 రోజుల నుంచే కొత్త యాప్‌ను అమలులోకి తీసుకువచ్చారు. ఈమేరకు అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి సేల్ పాయింట్ల వద్ద ఎరువు నిల్వల వివరాలు, ఫొటోలను ప్రతీ సోమ, గురువారాల్లో యాప్‌లో నిక్షిప్త పరుస్తారు. స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే ఫొటోలను మూడురోజుల వ్యవధిలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని రామాయంపేట మండల వ్యవసాయాధికారి రాంనారాయణ తెలిపారు. ఎరువుల దుకాణాల్లో పీవోఎస్ యంత్రాలు ఉపయోగిస్తున్నారా, లేదో వివరాలు సేకరించాల్సి ఉంటుంది. డివిజన్‌స్థాయి సంచాలకులు వారానికి రెండు రోజుల పాటు ఐదు దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలి. జిల్లా స్థాయిలో డీఏవో వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎరువుల కంట్రోల్ ఆర్డర్ ప్రకారం దుకాణాల నిర్వహణ పక్కాగా తెలుసుకోవచ్చు. యాప్‌లో జిల్లాస్థాయిలో కలెక్టర్, డీపీవోకు మాత్రమే లాగిన్ వెసులుబాటు కల్పించడంతో పర్యవేక్షణ పకడ్బందీగా ఉండనుందని అధికారులు పేర్కొంటున్నారు.



ఎరువుల దుకాణాలు	259
సహకార సంఘాలు	37
ఆగ్రో రైతుసేవా కేంద్రాలు	31
హాకా సెంటర్లు	15
రైతు ఉత్పత్తిదారుల సంఘాలు	12
హోల్ సేలర్స్	11

నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుంటేనే అవకాశాలు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా
- తరలివచ్చిన యువతీ యువకులు

మెదక్ అర్బన్, జనవరి 27: నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో మెదక్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌మేళా నిరుద్యోగులకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ప్రతీ మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్, రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉపాధి పొందవచ్చని తెలియజేశారు. అనంతరం ఆయా కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాబ్‌మేళాలో 70 కంపెనీలు 4వేల ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించాయని డీవైఎస్‌వో నాగరాజు తెలియజేశారు. ఐదో తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగిన 615 మంది జాబ్‌మేళాలో పాల్గొనగా 52 మంది ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. చదువుకుంటున్న 165 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో నిర్వహించిన జాబ్‌మేళాను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

'పదో తరగతిలో మెదక్ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి'

నర్సాపూర్, జనవరి 27: పదో తరగతి ఫలితాల్లో మెదక్ జిల్లాను నంబర్‌వన్‌గా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల సన్నద్ధమవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఏవిధంగా శిక్షణ ఇస్తున్నారో ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి చదువుతున్న అత్యధిక శాతం విద్యార్థులకు 10 జీపీఎస్ వచ్చేలా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఉపాధ్యాయుడు కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకుని చదివించేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ప్రతీరోజు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటివద్ద కూడా చదివించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. టెక్నాలజీని వినియోగించుకుని ఆయా సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఇతర ఆలోచనలు పెట్టుకోకుండా చదువుపైనే దృష్టిసారించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి రాధకిషన్, ఎంఈవో బుచ్యానాయక్ ఉన్నారు.



నర్సాపూర్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆత్మవిశ్వాసంతో సాగితే విజయం మీదే

అంగవైకల్యం శరీరానికే... మనసుకు కాదు : సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 27 : అంగవైకల్యమనేది శరీరానికే ఉంటుందని, మనసుకు ఉండదని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైలూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు తమను తాము తక్కువ అనుకుని వెనుకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని అన్నారు. తన ఐఏఎస్ బ్యాచ్ అధికారి అజయ్ అరోరా పూర్తిగా అంధుడైనా ఆత్మవిశ్వాసంతో విజయాన్ని సాధించారని, రాజస్థాన్ క్యాడర్‌లో ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. దివ్యాంగులు సమాజంలో ఏ మాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుకుంటున్నారని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు మాట్లాడుతూ దివ్యాంగులు తమలోని వైకల్యం గురించి ఆలోచించకుండా తమలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసుకురావాలన్నారు. రాజ్యాంగపరంగా దివ్యాంగులు పొందాల్సిన హక్కులకు భంగం కలిగితే, న్యాయసేవా సదన్‌లో దరఖాస్తు చేస్తే ఉచితంగా న్యాయసహాయం అందిస్తామని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. బ్యాటరి వీల్‌చైర్స్, ఫోర్‌జి స్మార్ట్ ఫోన్లు, మోటరైజ్డ్ వాహనాలు అర్హులైన దివ్యాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీడబ్ల్యూవో సంధ్యారాణి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, డీఎంఅండ్‌హెచ్‌వో డా. గాయత్రి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఈవో వెంకటేశ్వర్లు, రత్నం, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్‌గౌడ్, జుబేదాబేగం, మహేష్ తదితరురలు పాల్గొన్నారు.



క్రీడల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులను అందజేస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

భరోసా కేంద్రం పనితీరు భేష్


సంగారెడ్డి జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు

సంగారెడ్డి క్రైం, జనవరి 27: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం పనితీరు బాగుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి శనివారం ఆయన భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరోసా కేంద్రంలో ఎలాంటి వసతులు ఉన్నాయో నిర్వాహకురాలు ఎస్ఐ నాగలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. భరోసా కేంద్రంలో వసతులు బాగున్నాయని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ భరోసా కేంద్రంలో ఉన్న బాధితులు ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని సూచించారు. ఆయనవెంట మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి జి.సుదర్శన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.హన్మంతరావు, జిల్లా అదనపు ఎస్పీ పి.అశోక్, డీఎస్పీ రమేష్ కుమార్, సీఐ రమేష్, డీఆర్వో నగేష్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని భరోసా కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి జిల్లాలో 11 మంది సీఐల బదిలీ



సంగారెడ్డి క్రైం, జనవరి 27: సంగారెడ్డి జిల్లాలో 11 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ఎం.ప్రవీన్‌రెడ్డిని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు, జిల్లా శిక్షణా కేంద్రంలో ఉన్న ఎం.రామకృష్ణారెడ్డిని పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సీహెచ్ సదా నాగరాజును అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు, అమీన్‌పూర్‌లో ఉన్న యు.శ్రీనివాసులురెడ్డిని డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. అలాగే డీసీఆర్‌బీలో ఉన్న ఎం.సాయి వెంకటకిషోర్ ఐజీ కార్యాలయానికి, పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న ఎన్.భాస్కర్ జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు, స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న ఎస్.శివలింగం సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. సీసీఎస్‌లో ఉన్న ఆర్.రవి జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు, జహీరాబాద్‌లో ఉన్న బాల్‌రాజ్ ఐజి కార్యాలయానికి, ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న పి.అశోక్ సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు, సంగారెడ్డి రూరల్‌లో ఉన్న వి.సుధీర్‌కుమార్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బదిలీ అయిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లందరూ వెంటనే తమ తమ పోస్టింగులలో చేరాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు రాయికోడ్

మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

రాయికోడ్, జనవరి 27: సంగారెడ్డి జిల్లాలోని రాయికోడ్‌లోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని కుర్మ నందిని ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2వ తేది వరకు విజయవాడలో నిర్వహించే దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. నీటిని పీల్చే కాంక్రీటు రహదారుల నమూనా తయారుచేసి ప్రదర్శించడంతో విద్యార్థిని విజయవాడలో జరిగే ప్రదర్శనకుఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక కావడం పట్ల విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థిని ప్రదర్శించిన నమూనా (ఫైల్)

అక్రమ క్రషర్లపై టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో విచారణ

సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, జనవరి 27 : సంగారెడ్డి డివిజన్ పరిధిలో ఉన్న అక్రమ స్టోన్‌క్రషర్లపై ఉక్కుపాదం మోపుతామని ఆర్డీవో రవీందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలో శనివారం ఆయన పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, ఇరిగేషన్ ఈఈ మధుసూదన్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలమేరకు సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టోన్‌క్రషర్లపై దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. పటాన్‌చెరు మండలం లక్డారం, జిన్నారం, కంది, సంగారెడ్డి మండలాల్లో ఉన్న క్రషర్లపై విచారణ జరిపేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాన్ని కలెక్టర్ ఏర్పాటు చేశారని వివరించారు. ఈ బృందంలో తనతో పాటు డీఎస్పీ, ఇరిగేషన్, రెవెన్యూ, ఎంపీడీవోలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అసైన్డ్ భూములు కొనడం, అమ్మడం నేరమని, మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి

విద్యా వైజ్ఞానిక సదస్సులను విజయవంతం చేయండి

● టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సంగయ్య

పాపన్నపేట, జనవరి 27: విద్యా వైజ్ఞానిక సభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సంగయ్య పేర్కొన్నారు. శనివారం పాపన్నపేటలో ఆ సభల పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరి 4న మెదక్‌లోని ద్వారకా గార్డెన్‌లో నిర్వహించే విద్యా సదస్సును, ఫిబ్రవరి 11, 12న నిర్వహించే విద్యా వైజ్ఞానిక మహాసభలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ కోదండరాం హాజరవుతారన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డితోపాటు పలువురు వక్తలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయ దర్శిని, ఎడిటర్ శశిధర్, రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు హీరాలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాల్‌రాజ్, రమేష్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ కార్యవర్గానికి నోటిఫికేషన్ జారీ

మనూరు, జనవరి 27: సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచ నల్ల పోచమ్మ దేవాలయం కార్యవర్గ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయినట్లు దేవాదాయశాఖ అధికారి మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల మొదటి వారంలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 27: వివక్ష, అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దామని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. ఖేడ్‌లో శనివారం కేవీపీఎస్ 2024 క్యాలెండర్లను ఆయన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. వివక్ష లేని సమాజస్థాపన కోసం అంబేడ్కర్, పూలే ఎంతగానో కృషి చేశారన్నారు. కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్‌షెట్కార్, దారం శంకర్, వివేకానంద్, రమేష్‌చౌహాన్, వినోద్‌పటేల్, పండరిరెడ్డి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు. ఇష్టపడి చదువుకున్నప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చిత్తశుద్ధితో చదువుకొని తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు దారం శంకర్, ప్రిన్సిపల్ రవీందర్, కరస్పాండెంట్ నర్సింహారెడ్డి ఉన్నారు.

సంగ్రాం మహరాజ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని వచ్చిన అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి ఆశ్రమ పీఠాధిపతి దేవదాస్ మహరాజ్‌ను శనివారం కొండాపూర్ హనుమాన్ అలయ ఆవరణలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నాగల్‌గిద్ద, జనవరి 27: పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం నాగల్‌గిద్ద మండల కేంద్రంలో 42 మంది కల్యాణలక్ష్మి చెక్కులను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. గత పాలకుల హయాంలో అర్హులందరికీ పథకాలు దక్కలేదన్నారు. జడ్పీటీసీ రాజురాథోడ్, వైస్ ఎంపీపీ పండరియాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాణిక్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంజీవరెడ్డి ఉన్నారు. అనంతరం మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాలతో పాటు హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ప్రిన్సిపల్ రమేష్ కళాశాలలో విద్యుత్, తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. త్వరలోనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. కళాశాలలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మొక్కలను నాటి నీరు పోశారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మనూరు, జనవరి 27: పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన మనూరులో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, తహసీల్దార్ మల్లేశం, సర్పంచులు, నాయకులు బోజిరెడ్డి, రాజు, సిద్దారెడ్డి, దత్తు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే

కంగ్టి, జనవరి 27: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కంగ్టిలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర పాలన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. తహసీల్దార్ విష్ణుసాగర్, సర్పంచులు పల్లవీ రాథోడ్, సురేఖ, మాజీ జడ్పీటీసీ సర్దార్ పాల్గొన్నారు.



నాగల్‌గిద్ద మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తాం

కల్హేర్/సిర్గాపూర్, జనవరి 27: రాజకీయాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సిర్గాపూర్, కల్హేర్‌లలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సిర్గాపూర్‌లో డీఎంఎఫ్ పథకం కింద మంజూరైన రూ.9 లక్షల నిధులచే నిర్మించే సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కల్హేర్ ఎంపీపీ గుర్రపు సుశీలాఅంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోచయ్య ఆత్మ కమిటీ, సీడీసీ, ఎంపీపీ మాజీ చైర్మన్లు నరేందర్, నర్సింహారెడ్డి, మల్లేశం, కల్హేర్, సిర్గాపూర్ సర్పంచులు లక్ష్మీబాలయ్య, స్వప్న, ఎంపీటీసీ పీరప్ప పాల్గొన్నారు.

'పది'లో ఫెయిల్ అవుతానేమోనని విద్యార్థి ఆత్మహత్య



కొత్తపల్లి సంజయ్‌గౌడ్ (ఫైల్)

హవేళిఘణపూర్, జనవరి 27: పదో తరగతిలో ఫెయిల్ అవుతానేమోననే భయంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి సాయాగౌడ్ వ్యవసాయం చేసుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కూతురు రసజ్ఞ, కుమారుడు సంజయ్‌గౌడ్(15) ఉన్నారు. కుమారుడు స్థానిక ప్రభుత్వ పాఠశాల్లో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఎప్పటిలాగే వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వచ్చి తలుపులు తట్టగా గడియ వేసి ఉండడంతో కిటికీలోంచి చూశారు. దీంతో సంజయ్ ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

● ముగ్గురికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు

చిన్నశంకరంపేట, జనవరి 27: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మెదక్-చేగుంట రహదారి టీ మాందాపూర్ రాంజీతండా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్నది. చిన్నశంకరంపేటకు చెందిన కటికె ప్రభాకర్ మెదక్ నుంచి ఇంటికి వస్తున్నాడు. కొర్విపల్లితండాకు చెందిన నేనావత్ చందర్, శాంతి దంపతులు మెదక్ వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి క్షతగాత్రుల వివరాలను సేకరించి, చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు బోల్తా, ఇద్దరికి గాయాలు



బోల్తాపడిన కారు

హత్నూర, జనవరి 27: ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన హత్నూర మండలం బోర్పట్ల బస్టాండ్ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. చౌటకూర్ మండలం ఏటిలింగపల్లి గ్రామానికి చెందిన వనంపల్లి నరేష్, మండే రవీందర్ కారులో దౌల్తాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తుండగా.. బోర్పట్ల గ్రామ శివారులోకి చేరుకోగానే అదుపుతప్పి కారు రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరేష్, రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం, వ్యక్తిపై కేసు

శివ్వంపేట, జనవరి 27: ఉద్యోగం పేరిట నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మండలంలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన కార్తీక్, దొంతి గ్రామానికి చెందిన జైపాల్‌కు పంజాబ్ రాష్ట్రంలో ఓ సంస్థలో మంచి వేతనంతో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి రూ.1.40 లక్షలను రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామానికి చెందిన రంజిత్ స్వాహా చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్ తెలిపారు.

అనుమతులు లేకుండా మందుల విక్రయం, ఆర్ఎంపీపై కేసు

శివ్వంపేట, జనవరి 27: అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్న ఆర్ఎంపీపై కేసు నమోదు చేసిన ఘటన శివ్వంపేట మండలం కొత్తపేటలో చోటు చేసుకున్నది. సిద్దిపేట జిల్లాకు చెందిన డ్రగ్ కంట్రోల్‌కు చెందిన ఏడీ సుధీర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కొత్తపేటలోని ఆర్ఎంపీ శ్రీనివాస్‌కు చెందిన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 41 రకాల అనుమతులు లేని మందులను ఉపయోగించడంతో పాటు లైసెన్సు లేకుండా విక్రయిస్తున్నందుకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు

వెల్దుర్తి, జనవరి 27: అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని వెల్దుర్తి తహసీల్దార్ తులసీరామ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో వెల్దుర్తి, మాసాయిపేట తహసీల్దార్లు తులసీరామ్, జ్ఞాన జ్యోతి, ఎస్ఐ మధుసూదన్‌గౌడ్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూములు, కుంట, శిఖంల నుంచి మట్టిరవాణా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే హల్దీవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట, జనవరి 27: మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం సమీపంలో మెడిసిటి హాస్పిటల్ మేడ్చల్, లయన్స్‌క్లబ్ స్నేహబంధు రామాయంపేట ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించామని క్లబ్ అధ్యక్షుడు తమ్మలి రమేష్ అన్నారు. ఇందులో బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, వరిబీజం, బీజకుట్టు, గడ్డలు, కణతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలపై 240 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశామని తెలిపారు. అలాగే 60 మంది రోగులకు మెరుగైన వైద్య చికిత్సల కోసం మెడిసిటి హాస్పిటల్‌కు రెఫర్ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడిసిటి వైద్య బృందం సుచిత్ర, జిత్ర, ఐశ్వర్య, వర్షిని, హారతి, మార్కెటింగ్ ఇన్‌చార్జి సంజయ్ నాగరాజు, రాజు, ఇందు పాల్గొన్నారు.

'గావ్ చలో అభియాన్'ను జయప్రదం చేయాలి: విఠల్



పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు విఠల్

పెద్దశంకరంపేట, జనవరి 27: ఫిబ్రవరి 4 నుంచి 11 వరకు బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న గావ్ చలో అభియాన్ (పల్లెకుపోదాం అభియాన్) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ పెద్దశంకరంపేట మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికి కార్యకర్తలు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి బూత్‌స్థాయిలో ప్రజలందరికీ వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ, మహేష్, బుగుడాల కృష్ణ, అనిల్, సుభాష్, సురేష్, అంజయ్య రాజు, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు చిమ్నాపూర్‌లో యశస్సు కార్యక్రమం

● హాజరుకానున్న మాధవానంద సరస్వతీ

కంది, జనవరి 27: కంది మండలం చిమ్నాపూర్ గ్రామంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో యశస్సు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమానికి మాధవానంద సరస్వతీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. గ్రామస్థుల్లో ఐక్యత, చైతన్యం, సమానత్వం నింపడానికి మాధవానంద సరస్వతీ స్వామి గ్రామంలో పర్యటించి, ఆధ్యాత్మిక బోధన చేయనున్నారు. బ్రాహ్మణ సంఘం సభ్యులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

'కార్మిక వ్యతిరేకి మోదీకి బుద్ధి చెబుదాం'

సంగారెడ్డి రూరల్, జనవరి 27: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్రమోదీకి కార్మిక వర్గం బుద్ధి చెప్పాలని వక్తలు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి సుందర్, గ్రామపంచాయతీ యూనియన్ రాష్ట్ర నాయకుడు వెంకటరాజ్యం మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బాబురావు, శ్రీధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

హత్నూర, జనవరి 27: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల సలహాదారుడిగా నియామకమైన షబ్బీర్ అలీని శనివారం కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.హకీమ్, దౌల్తాబాద్ ఉప సర్పంచ్ రియాజ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ధరణిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

గుమ్మడిదల: ప్రస్తుత తరుణంలో ధరణిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాల సంరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావుకు రైతులు విన్నవించారు.

నిధులను మంజూరు చేయాలి: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, జనవరి 26: గత ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం మంజూరైన రూ.475 కోట్ల నిధులను సత్వరమే విడుదల చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కర్దనూరు గ్రామంలో రూ.1.50 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం ముత్తంగి గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం భవనాన్ని ప్రారంభించారు.



నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ఎంపీపీ సుష్మశ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, సర్పంచ్ ఎర్ర భాగ్యలక్ష్మీసత్యానారాయణ, ఎంపీటీసీ నాగజ్యోతీలక్ష్మణ్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు పాల్గొన్నారు.

బాధితులకు బాసటగా బీఆర్ఎస్: ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, జనవరి 27: బీఆర్ఎస్ బాధితులకు బాసటగా నిలుస్తున్నదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోహీర్‌మండలం సజ్జాపూర్‌కు చెందిన పెద్దదొడ్డి పాండురంగారెడ్డి కుటుంబసభ్యులకు బీఆర్ఎస్ తరఫున మంజూరైన రూ.2.0 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పపల్లి పీఏసీఎస్ చైర్మన్ మశ్చేందర్, పార్టీ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, నాయకులు బండి మోహన్, శివప్ప, విజయ్ పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న మాణిక్‌రావు

ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన నాయకులు



ప్రొఫెసర్ కోదండరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

తూప్రాన్/నర్సాపూర్/చేగుంట, జనవరి 27: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియామకమైన ప్రొఫెసర్ కోదండరాంను తూప్రాన్ నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. కోదండరాంను కలిసిన వారిలో గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండాపురం బాల్‌రాజ్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, గౌడ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు కృష్ణగౌడ్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు సడిమెల యాదగిరిలు కలిశారు. ఎమ్మెల్సీగా నియామకమైన కోదండరాంను నర్సాపూర్‌కు చెందిన రిటైర్డ్ హెచ్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండం మోహన్‌రెడ్డి శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరాంను నార్సింగి మండలం నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీజేఎస్, గౌడ సంఘ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు కొండాపురం బాలరాజ్‌గౌడ్, టీజేఎస్ జిల్లా కన్వీనర్ సడిమెల యాదగిరి, ఎస్సీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవర్ధన్, గౌడ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

● జిల్లా అదనపు కలెక్టర్ రమేష్

మెదక్ అర్బన్, జనవరి 27: విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ సంస్థ చైర్మన్లను తొలగించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా నియామకమైన తర్వాత శనివారం తొలిసారిగా గ్రంథాలయ అధికారులతో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. పుస్తక పఠనం ద్వారా ఊహాశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. గ్రంథాలయాల్లో చదివి ఎంతోమంది ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థానాల్లో ఉన్నారన్నారు. పలు రకాల పుస్తకాలు, కంప్యూటర్స్, ఇంటర్నెట్, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధికి పలు ప్రతిపాదనలను తయారుచేసి కమిటీ ఆమోదించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, డీపీవో సాయిబాబా, డీపీఆర్వో ఏడుకొండల్, గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అవకతవకలపై టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

పటాన్‌చెరు రూరల్, జనవరి 26: లక్డారం గ్రామంలోని మైనింగ్ అవకతవకలపై టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శనివారం తనిఖీలు నిర్వహించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, తహసీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో పలు క్రషర్లను తనిఖీ చేశారు. క్రషర్ల యజమానులు తీసుకున్న అనుమతులు, వాటి పరిమితి, లోతు, స్థానిక ప్రజల ఇబ్బందులు తదితర అంశాలపై సుదీర్ఘంగా విచారణ చేపట్టారు. 11 రోజుల పాటు విచారణ కొనసాగుతున్నదని, తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

పంటలు, ఎరువుల దుకాణాల పరిశీలన

కల్హేర్, జనవరి 27: మండల పరిధిలోని బీబిపేట, మార్డి పీఏసీఎస్‌ల పరిధిలో కొనసాగుతున్న ఎరువుల దుకాణాలను, కల్హేర్‌లో డీసీఎంఎస్ పరిధిలో కొనసాగుతున్న పురుగుల మందులు, ఎరువుల దుకాణాన్ని కల్హేర్ వ్యవసాయ అధికారి శశాంక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. యాసంగి పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను రైతులకు అందజేయాలని సూచించారు. అనంతరం సిర్గాపూర్ మండల పరిధిలోని సంగెం గ్రామ శివారులో సాగుచేస్తున్న జొన్న పంటను ఆయన పరిశీలించారు.

మట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

జహీరాబాద్, జనవరి 27: జిల్లా ఎస్పీ చెన్నూరీ రూపేష్ ఆదేశాల మేరకు శనివారం జహీరాబాద్ పట్టణంతోపాటు రంజోల్, తదితర గ్రామాల్లోని మట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు బృందాలుగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,43,500 నగదు, మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో భాగంగా క్రిష్ణ(రంజోల్), రవి(రంజోల్), కంటిరాజు(రంజోల్), చిల్కపల్లి చంద్రయ్య(రంజోల్), బోయిని నర్సింలు(సుభాస్‌గంజ్), కురేషి యాదుల్(సుభాష్‌గంజ్)లను అదుపులోకి తీసున్నారు.



పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ మట్కా నిర్వాహకులు, నగదు, సెల్‌ఫోన్లు

కార్మిక హక్కులపై అవగాహన పెంచుకోవాలి

సంగారెడ్డి రూరల్, జనవరి 27: గృహ కార్మికులు కార్మిక హక్కులపై అవగాహన పెంచుకోవాలని మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని మెడ్వాన్ సంస్థ కార్యాలయంలో శనివారం గృహ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ కార్మికులు తమ తోటి కార్మికుల సమస్యలను ఓపికగా విని స్పందించే గుణం ఉన్నప్పుడే నాయకులుగా ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడ్వాన్ సంస్థ కో ఆర్డినేటర్ స్వప్న, చైల్డ్ లైన్ సంస్థ కో ఆర్డినేటర్ ముజీబ్ పాల్గొన్నారు.

మెదక్ ఎంపీ సీటు బీరయ్యయాదవ్‌కు కేటాయించాలి

సంగారెడ్డి రూరల్, జనవరి 27: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ సీటు బీరయ్యయాదవ్‌కు కేటాయించాలని బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తగొల్ల మల్లేశ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2001 సంవత్సరం నుంచి తెలంగాణ ఉద్యమంలో లాఠీదెబ్బలు తిని జైలు జీవితం కూడా అనుభవించారన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణ సీఐగా రవి బాధ్యతల స్వీకరణ

జహీరాబాద్, జనవరి 27: జహీరాబాద్ పట్టణ సీఐగా ఆర్.రవి శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సీఐల బదిలీల్లో భాగంగా సంగారెడ్డి సీసీఎస్‌లో ఉన్న రవిని జహీరాబాద్ సీఐగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. నాలుగునెలలుగా జహీరాబాద్ సీఐగా పనిచేసిన బీ.రాజు హైదరాబాద్ ఐజీపీ కార్యాలయానికి వెళ్లారు.



బాధ్యతలు స్వీకరించిన సీఐ రవి

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం: ఎంపీడీవో

పుల్‌కల్, జనవరి 27: గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసి, ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలను త్వరితగతిన అందజేయాలని ఎంపీడీవో ఎస్సీ జయలక్ష్మి కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశం ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే పనులను ముందుగా గుర్తించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ గ్రాంట్ల కింద నిధులు విడుదల చేస్తుండటంతో ఆయా నిధులతో ఏఏ పనులు చేపట్టాలో నిర్ణయించాలని సూచించారు. పంచాయతీలకు క్రీడా సామగ్రి మంజూరైనా ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడం పట్ల సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన అనంతరం వాటిని అందజేస్తామని ఎంపీడీవో చెప్పారు. శివ్వంపేట గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు ఇప్పటివరకు రావడం లేదని, తాము గెలిచి ఐదేళ్లు గడిచినా తాగు జలాలు సరఫరా చేయకపోవడంపై సర్పంచ్ పట్లోళ్ల రాజిరెడ్డి, ఎంపీటీసీ కలాలి కిరణ్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రతీ సాధారణ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, పట్టించుకోలేదని ఆరోపించారు. పంచాయతీరాజ్ ఏఈఈ శశికుమార్, ముదిరాజ్, సీనియర్ సహాయకులు మల్లికార్జున్, ఎంపీఈవో శ్రీకాంత్, ఏవో చైతన్య, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో సంతోష్‌కుమార్, పశు వైద్యాధికారి దీపాంకర్‌పాల్, పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బక్కారెడ్డి కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయలక్ష్మి, హాజరైన ప్రజాప్రతినిధులు

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా దొంత నరేందర్

మెదక్ అర్బన్, జనవరి 27: తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల (టీఎన్జీవో) మెదక్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దొంత నరేందర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఎన్జీవో భవన్‌లో కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ ఏవో తోట కుమార్ నీల వ్యవహరించగా.. జిల్లా పరిధిలోని ఏడు యూనిట్లు, డిపార్ట్‌మెంటల్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులతోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. జిల్లా కార్యదర్శిగా రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా ఇక్బాల్‌పాషా, కోశాధికారిగా చంద్రశేఖర్ ఉపాధ్యక్షులుగా మనోహర్, ఫణిరాజ్, ఫజులోద్దీన్, రఘునాథ్‌రావు, అర్షద్, మహిళా ఉపాధ్యక్షురాలుగా లీలా, జెయింట్ సెక్రటరీగా శంకర్, చిరంజీవచార్యులు, శివాజీ, కిరణ్‌కుమార్, రాధ, గోపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెల్దుర్తి/తూప్రాన్/నారాయణఖేడ్, జనవరి 27: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం వెల్దుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి, శేరి, చర్లపల్లి, బస్వాపూర్, పంతులపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు. తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ వరహాలబాబు తెలిపారు. నారాయణఖేడ్ పట్టణంలో 28న ఉదయం 10 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.